# 3. కార్గిల్ హీరో అమర్ రహే!

వీరాస్వామి బస్‌స్టేషనులో దిగి అదే రోడ్డుమీద నూరు మీటర్లు ముందుకి నడిచాడు. అక్కడ పోస్టాఫీసు ఉంది. రెండడుగులు వేసి కుడిచేతివైపు తిరిగితే, మెట్లంగి రోడ్డు వచ్చింది. ఆ రోడ్డు తిన్నగా ఆనంద్ తండ్రిగారి గ్రామం వరకు పోతుంది.

అప్పటికే చీకటి ముసురుకుంటున్నది. పగటిపూట రిక్షాలు దొరుకుతాయి. మనిషికి పది రూపాయలు పుచ్చుకుంటారు. రాత్రిపూట ఏ రిక్షావాడూ మరో రెండు రూపాయలు హెచ్చు ఇస్తామన్నా రాలేదు. ఆ రోడ్డు వెంబడి వెళ్తే, కొద్ది ఇళ్ల వరుసల తరువాత, పట్టణం అటువైపు ఒక్కసారిగా అంతమైంది. వీధి దీపాలు కూడా అక్కడితో ముగిసిపోయాయి. ఆకాశంనిండా నక్షత్రాలు తోచాయి. వాటి వెలుగులో దారి, ఇటుపక్కల అటుపక్కల ఉన్న గోధుమ పొలాలు, కనిపించీ కనిపించనట్లు దర్శనమిచ్చాయి.

ఆనంద్ మాటల ప్రకారం, వాళ్ల గ్రామం చేరేవరకు మధ్యన ఇళ్లు కానీ, మరే గ్రామాలు కానీ ఎదురవవు. పది కిలోమీటర్లు నడిస్తే ఆ గ్రామాన్ని చేరవచ్చు.

వీరాస్వామి సాయంకాలం నాలుగు గంటలకే పట్టణం చేరుకునేవాడు. కానీ, ముందు బయలుదేరే బస్సు ఢిల్లీలో తప్పిపోయాడు. దాని వెనుక పోయే బస్సు మూడు గంటల తరువాత బయలుదేరింది.

వీరాస్వామి కొంతదూరం చకచక నడిచాడు. అతను చాలా దృఢమైనవాడు, పది కిలోమీటర్లు నడక అతనికి ఏమీ కాదు. బరువైన సూట్‌కేసు, ఒకచేతి సంచీ.. అతను రెండు చేతులతోను పట్టుకున్నాడు. కొంచెం దూరం నడిచిన తరువాత అతను సూట్‌కేసు తలకు ఎత్తుకుని, బాగ్ భుజానికి తగిలించికుని నడిచాడు.

రాత్రి తొమ్మిది గంటలకు పోయి ఆనంద్ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం అతనికి నచ్చలేదు. పట్టణంలోనే ఆ రాత్రి ఏ లాడ్జిలోనో గడిపి, మరునాడు ఉదయం గ్రామం చేరుకోవాలనుకున్నాడు. కానీ ఆనంద్ జ్ఞాపకాలు ఒప్పుకోలేదు. రాత్రి అనవసరంగా పట్టణంలో గడపడం కన్నా తను వాళ్లతో గడపవచ్చుననుకున్నాడు. ఆనంద్ మాటల ప్రకారం వాళ్లమ్మగారు చాలా ఉత్తమురాలు. ఆలస్యంగా వచ్చిన అతిథిని పస్తు పడుకోనీయదు, వండిపెడుతుంది. తన కొడుకు ఆనంద్ మిత్రుడు, అంతదూరం నుండి వచ్చాడని తలచి, ఆదరాభిమానాలతో గౌరవిస్తుంది.

గోధుమ పొలాలనుండి చల్లని గాలి వీచింది. స్కూటరొకటి, గ్రామం నుండి ఎదురుగా వస్తూ, చీకటిని హెడ్‌లైట్ కాంతితో చీల్చుకుంటూ, పట్టణం వైపు వెళ్లిపోయింది. మళ్లీ నిశ్శబ్దం అలముకుంది. అప్పుడప్పుడూ కీచురాళ్లు చప్పుడు చేస్తున్నాయి.

దూరాన్నుండి ఒంటరి పిట్ట కూత ఉండుండి వినిపిస్తున్నది.

వీరాస్వామి, ఆనంద్, ఒకేరోజు, మూడు సంవత్సరాలకింద సైన్యంలో చేరారు. శిక్షణ అయిన తరువాత కాశ్మీరులో ఉన్న రెజిమెంటుకి వాళ్లని వేశారు శ్రీనగర్ కాంప్‌లో ఇద్దరూ ఒకే గదిలో ఉండేవారు. పరిచయాలయిన తరువాత ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన వీరాస్వామి, ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన ఆనంద్ సోదరులవలె వ్యవహరించారు.

వీరాస్వామి చామనచాయగా ఉంటాడు. పల్లెటూరి అమాయకత్వం అతనిముఖంలో తోస్తుంది. ఆనంద్ చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంటాడు. వీరాస్వామి అన్నీ వింటాడు, గానీ మాట్లాడడు. ఆనంద్ మాట్లాడడంలో నేర్పు కలవాడు. ఈ భిన్నమైన వారి స్వభావాలు వారిని వేరు చేయడానికి బదులు దగ్గరగా తీసుకుని వచ్చాయి.

శాంతిగా ఉండే దినాలలో, డ్రిల్లు మొదలైన దైనందిన చర్యల తరువాత, మిత్రులిద్దరూ లోయను మామూలు దుస్తులు వేసుకుని చూసి వచ్చేవారు. సెలవులు దొరికినప్పుడు నగరం విడిచి, దగ్గరగా ఉన్న సుందరమైన స్థలాలు దర్శించి వచ్చేవారు.

రెండవ సంవత్సరానికి వాళ్లు చాలా సన్నిహితులై, ఆనందంగా గడిపారు.

వీరాస్వామి, రెండు నెలల సెలవుమీద దేశం వెళ్లి ఈమధ్యనే తిరిగి వచ్చాడు. తరువాత ఆనంద్‌కి రెండు నెలల సెలవు మంజూరైంది. మిలిటరీ స్టోర్సు నుండి అతను బాదంపిక్కలు, బిస్కత్తులు, సబ్బులు, తమ్ముడికి బనియనులు మొదలైనవి కొన్నాడు. శ్రీనగర్ మార్కెట్ నుండి తల్లికొక మంచి చీర, చెల్లెలికి కాశ్మీరు దేశపు దుస్తులు కొన్నాడు.

మరునాడు ఆనంద్ సెలవుమీద వెళ్లిపోతాడు. కానీ, ఆనాడే కార్గిల్ పోరాటం మొదలయింది. ఆనంద్ సెలవు రద్దయింది. వీరాస్వామిని, ఆనంద్‌ని తేలికపాటి మెషిన్ గన్ ఆపరేటర్లుగా పంపించారు.

వాళ్లు మెషిన్ గన్‌ను మోసుకుంటూ యుద్ధంలో పనిచేశారు. శత్రువు చేజిక్కించుకున్న టైగర్ హిల్‌ని తిరిగి ఆక్రమించుకోవడమే వారి లక్ష్యం.

ఆ పర్వతంమీద ఒక్కొక్క అంగుళం ముందుకు సాగుతూ ఆనంద్ తన స్వంత విషయాలు చాలా వీరాస్వామితో చెప్పడం మొదలుపెట్టాడు. వీరాస్వామి సావకాశంగా అన్నీ విన్నాడు.

ఆనంద్ తండ్రి నూటికి నూరుపాళ్లు రైతు. ఆనంద్ పుట్టినప్పటికి అతనికి రెండు బిగాల పంటపొలం, గ్రామంలో ఒక పూరిల్లు ఉండేది. అతని పేరు కుందన్‌లాల్. ఆనంద్ ఇంటర్ పాసయ్యేసరికి వాళ్లకి అర బిగా పొలం మాత్రం మిగిలింది. కుందన్‌లాల్‌కి చదువు సంధ్యలు లేవు. అయినా అతను తన కొడుకులిద్దరికి, కూతురికి చదువు చెప్పించడంలో వెనుకంజ వెయ్యలేదు.

చాలా సంకటమైన పరిస్థితులలో కుటుంబం ముందుకు సాగింది. ఆనంద్ ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. కానీ, రెండు సంవత్సరాలవరకు ఎటువంటి ఉద్యోగం దొరకలేదు. అతను విసుగెత్తి సైన్యంలో చేరిపోయాడు.

ఇంటివాళ్లకు ఆనంద్ సైన్యంలో చేరినట్లు తెలియదు. అతని శిక్షణ పూర్తయి, శ్రీనగర్‌కి అతనిని వేసిన తరువాత, అతని తల్లిదండ్రులకు అతని ఉనికి తెలిసింది. అప్పటినుంచి కుటుంబానికి ఆర్థికమైన ఇబ్బందులు తొలగిపోయాయి.

నెలనెలా ఆనంద్ తండ్రికి డబ్బు పంపించాడు. అతని తమ్ముడు కిరణ్, పట్టణంలో కాలేజీలో తిరిగి చేరి డిగ్రీ కోర్సు పూర్తి చేశాడు. అంతకుముందు డబ్బుకి ఇబ్బందిపడి ఆఖరు సంవత్సరంలో అతను చదువు ఆపివేయవలసి వచ్చింది.

సరిత ఆనంద్ చెల్లెలు. ఆమె హై స్కూల్‌లో చదువుతున్నది. ఫైనల్ పరీక్షల తరువాత ఆమె చదువు మానిపించి, మంచి సంబంధంకోసం వెదికే ఆలోచన ఉంది. ఈరోజుల్లో ఆడపిల్ల పెళ్లి చాలా ఖర్చుతో కూడినపని. కనీసం ఒక లక్ష రూపాయలైనా కట్నం కోసం వెనక వేయాలి. పెళ్లి ఖర్చు ఉండనే ఉంది. పిల్లను అత్తవారింటికి పంపడానికి మరో పాతికవేలు సిద్ధంగా ఉండాలి. సరిత చాలా అందమైనది, చాలా తెలివైనది. మంచి సంగీతం నేర్చుకుంది. ఆమెకింకా పదహారేళ్లే... ఆమె ఎంత అందమైనదైనా, ఎంత గుణవంతురాలైనా, పెళ్లికొడుకు అంత సులువుగా దొరకడు. కానీ, ఆమెకు వివాహం మీద మనసు లేదు.

ఆమె తన స్నేహితురాండ్రవలె పెద్ద చదువులు చదువుకుందామని అనుకుంది విశ్వవిద్యాలయంలో చేరి, పి.హెచ్‌డి. పట్టంకోసం పరిశ్రమించాలని కోరింది. కానీ ఒక్క సంగతి మనం మరచిపోకూడదు ఆడది ఎంత చదువులు చదివితే మాత్రం ప్రయోజనమేముంది. ఎవరో అయ్యను కట్టుకోక తప్పదు. ఇటువంటి పెద్ద చదువులు చదవాలంటే ఆమె కలిగిన వాళ్ల ఇంట్లో పుట్టి ఉండవలసింది. పేదరైతు ఇంట్లో పుట్టిన అమ్మాయి అంత పెద్ద కోరిక మీద మనసుంచకూడదు. కానీ, అన్నీ తెలిసిన ఆనంద్, చెల్లెలు సరిత పెళ్లికోసం ప్రతి పైసా వెనుక వేశాడు.

ఆనంద్ తను చదువుకునే రోజుల గురించి చాలా సంగతులు చెప్పాడు. పక్కంటి ఆయనకు ఒక చక్కని కూతురుంది. ఆనంద్, ఆ అమ్మాయి చాలా దగ్గరకు వచ్చారు. ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ప్రేమ ఒక్కటే ముఖ్యం కాదు వరుడు ముఖ్యం. ఆ వరుడికి మంచి చదువుండాలి, స్థిరమైన ప్రభుత్వోద్యోగం ఉండాలి. స్వంతమైన పెద్ద ఇల్లు ఉండాలి. భూములు ఉండాలి ... ఇలా ఎన్నో! ఈ సుగుణాలలో ఒకటి కూడా ఆనంద్ పేరుకి చేర్చడానికి లేవు. అతను ప్రేమించిన అమ్మాయిని, పట్టణంలోని ఒక దౌర్భాగ్యుడికిచ్చి పెళ్లి జరిపించారు.

ఆనంద్ మిలటరీలో చేరడానికి ఇది ముఖ్య కారణం.

తండ్రి గొప్ప వ్యాపారస్తుడైతే, ఆనంద్ నిత్యజీవితంలో బాగా రాణించి ఉండేవాడు. కానీ, అతని తండ్రి సామాన్యుడైన రైతు. అందుకు ఆనంద్ ఎప్పుడూ విచారించలేదు. అతను మనసులోను, శారీరకంగాను నిర్మలంగా ఉండేవాడు. అందుచేతనే వీరాస్వామి అతనిని ఆరాధించేవాడు.

తన స్వంత విషయాలు అంత హెచ్చుగా ఆనంద్ ఎందుకు వీరాస్వామికి చెప్పాడు? తనవంతుగా, వీరాస్వామి తన కుటుంబం గురించి గానీ, తన గ్రామం గురించి కానీ అతనితో చెప్పలేదు! అతను విషాదకర సంఘటనను, దేనినైనా, శంకించాడా?

టైగర్ హిల్‌ని హస్తగతం చేసుకునే ప్రయత్నంలో, ఎత్తుగా ఉన్న కొండలను ఎక్కడానికి వాళ్లు చాలా శ్రమపడ్డారు. పగటి వేళల్లో, నత్తనడకతో, అంగుళం అంగుళం ముందుకు పోయారు. పర్వతశిఖరం వాళ్ల గమ్యం. శత్రువు చాలా బలంగా ఎదుర్కొంటున్నాడు. మంచు నిండిన హిమాలయ పర్వత పంక్తులపై సూర్యకిరణాలు ప్రతిబింబించి వాళ్ల కళ్లు చెదిరిపోయాయి. చాలా ఎత్తులమీద వీచే చల్లని గాలి వాళ్ల ముఖాలను స్పర్శ లేకుండా చేసింది. బరువైన బూట్లతో హెచ్చు తగ్గులున్న పర్వత ప్రదేశంమీద, పరికరాలను పట్టుకొని ముందుకు సాగడం దుర్భరమైంది. వాళ్ల ధ్యేయం కొత్త ప్రదేశాలను గెలవడం కాదు, శత్రువు ఆక్రమించిన భూమిని తిరిగి కైవసం చేసుకోవడం. ఈ యుద్ధంలో చనిపోయినవారి సంఖ్య భారీగా ఉండనే ఉంది. కానీ, దేనినీ లక్ష్యం చేయకుండా పట్టుదలతో సైన్యం ముందుకు నడిచింది.

ఆనంద్ తండ్రికి ఎటువంటి వ్యసనాలు లేవు. కులాసా పుడితే గుడాకు పీలుస్తాడు. హుక్కా తాగుతూ తన పంట భూమి గురించి కలలుగంటాడు. అతను ఉదయం నాలుగు గంటల నుండి చీకటి పడేవరకూ పొలంలో పనిచేస్తాడు. పిల్లల పోషణ విషయంలో తన లేమి గురించి కానీ, నిస్సహాయత గురించి కానీ అతను ఎప్పుడూ ఎవరితోనూ చెప్పుకోలేదు.

ఆనంద్ తల్లి గాయత్రీదేవి ఉత్తమ ఇల్లాలు. చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో ఆమె బయటపడకుండా ఇల్లు దిద్దుకుంది. బంధువులు, అతిథులు నిత్యం వాళ్ల ఇంటికి వస్తూనే ఉండేవాళ్లు. ఆమె చాలా గొప్ప గృహిణి అని గ్రామం అంతటా చెప్పుకుంటారు.

ఆ రాత్రి చాలా చలిగా ఉంది. బయట మంచు విపరీతంగా కురుస్తున్నది. గాలి జోరుగా వీస్తూ ఊళ పెడుతున్నది. ఉండి ఉడిగా శత్రువు ఫిరంగి గుళ్లు కురిపిస్తూనే ఉన్నాడు. కొన్ని గుళ్లు వాళ్ల టెంట్‌ని రాసుకుంటూ పోయాయి. టెంట్‌లో నీళ్లు లేవు. ఇద్దరికీ, అంత చలిలోనూ దాహం వేసింది. వీరాస్వామి ధైర్యంచేసి బయటకు పోయి కెటిల్ నిండా తాజా మంచును నింపుకొని వచ్చాడు. మంచు కరిగిన తరువాత నీళ్లల్లో మాత్రలు వేసుకొని

తాగారు. వాళ్లు స్టవ్ ముట్టించలేదు. టీ లేదు. మధ్యాహ్నం హెలికాప్టరుల నుండి ఆహారం పొట్లాలు విడిచారు. అవసరమైనవాటిని సైనికులకు అందిస్తూనే ఉన్నారు. కానీ వాళ్ల దృష్టి టైగర్ హిల్ పునరాక్రమణ మీదే కేంద్రీకరించడంచేత అన్నీ మరిచిపోయారు.

ఆ రాత్రి ఆనంద్, వీరాస్వామిని తన గ్రామానికి వెళ్లమని, తనవాళ్లను కలవమని, వాళ్లతో ఒక వారం రోజులు గడపమని, తన తల్లి గాయత్రీదేవి వండిన రుచికరమైన పదార్థాలు ఆరగించమని, తన తమ్ముడితో ఉద్యోగం గురించి ఆందోళనపడి తల్లిదండ్రులను వేధించవద్దని, చివరగా తన చెల్లిలితో, ఆమె పెళ్లికోసం తను డబ్బు వెనక వేస్తున్నట్లు చెప్పమని మరీమరీ చెప్పాడు.

ఆ విషయాలు ఆనంద్ ఎందుకు చెప్పాడు?

మరునాటి ఉదయం పైన వాతావరణం బాగలేదు. గడిచిన రాత్రి మిత్రులిద్దరూ స్లీపింగ్‌బాగ్స్‌లో కనీసం విశ్రాంతి కూడా తీసుకోలేకపోయారు. ఎముకలు కొరికే చలి వాళ్లను కనికరించలేదు. పోరాటం ఒక కొలికికి వస్తున్నది. ముందున్న వరుసలు మాయమయ్యాయి. వాళ్లే ఇప్పుడు ముందున్నవాళ్లు మరో రెండువందల మీటర్లు ముందుకు కొండ ఎక్కితే టైగర్ హిల్ పూర్తిగా వాళ్లకు కైవసమవుతుంది. విజయవంతంగా పోరాటం ముగుస్తుంది.

ఒక్కసారిగా ఆనంద్ మాటలు ఆపివేశాడు. పర్వతశిఖరం మీదికి దృష్టి కేంద్రీకరించాడు. వాళ్లిద్దరూ నిలకడగా పర్వతాన్ని అధిరోహించడం మొదలుపెట్టారు.

ఆనంద్ సరిహద్దు రేఖవైపు చూస్తున్నాడు. అటువైపు నుంచి తిరిగి ఫిరంగి గుళ్లవాన ప్రారంభమయింది. మొదట ఆ గుళ్లు శిఖరంవైపు ప్రయాణం చేశాయి. కొద్ది సేపటిలో అవి దిగువభాగంమీద పడడం మొదలయింది. అకస్మాత్తుగా వాళ్ల మెషిన్ గన్ వేసిన ఒక గుండు రావడం ఆనంద్ చూశాడు. గుండు చాలా వేగంగా వస్తున్నది. మరే ఆలోచనా లేకుండా వీరాస్వామిని దాని నుండి తప్పించడానికి, బలంగా దిగువవైపు తోసివేశాడు. ఈ ప్రయత్నంలో ఆనంద్ ఆ గుండుకి గురయ్యాడు.

ఒక వారం తరువాత బేస్ హాస్పిటల్‌లో, వీరాస్వామికి తెలివి వచ్చింది. షాక్‌కోసం, చిన్న దెబ్బలకోసం అతనికి చికిత్స చేస్తున్నారు. ఆ సమయంలో అతనికి ఆనంద్ గురించి తెలిసింది. శత్రువు విడిచిన గుండు తగిలి ఆనంద్ ఎగిరిపోయాడు. అతని దేహాన్ని ఢిల్లీ వరకు ప్లెయిన్‌మీద తీసుకొని వెళ్లారు. అక్కడనుండి ప్రత్యేకమైన మిలటరీ వాహనం మీద వాళ్ల గ్రామం తీసుకుపోయారు. అక్కడ అన్ని సైనిక మర్యాదలతో అంత్యక్రియలు జరిపారు. కలెక్టరుగారు, పురప్రముఖులు వాటికి హాజరయ్యారు. ఆనంద్ వీరమరణం గురించి రేడియోలోనూ, దూరదర్శన్‌లోనూ వచ్చింది. కార్గిల్ హీరో అతడని వక్కాణించారు.

మరో రెండు వారాలు హాస్పిటల్‌లో ఉన్న తరువాత వీరాస్వామిని విడిచిపెట్టారు.

అతను తిరిగి తన శ్రీనగర్ కాంప్‌కి వెళ్లిపోయాడు.

కాంప్‌లో వీరాస్వామి తన గది తలుపులు తెరిచాడు. గది బావురముంటూ ఉంది .ఒకపక్కన ఆనంద్ మంచముంది. దానిమీద దుప్పటి చక్కగా పరచి ఉంది. అతని కొత్త సూట్‌కేసు, సంచి టేబులు మీద ఉన్నాయి. ఆనంద్ ప్రతి చిన్న పనిలోనూ శ్రద్ధ వహించేవాడు.

వీరాస్వామి దు:ఖం ఆపుకోలేకపోయాడు. కొంతసేపు వెక్కివెక్కి ఏడ్చాడు. స్వంత తమ్ముడు మరణించినట్లు బాధపడ్డాడు. వీరాస్వామి స్నేహితులలో కొందరు పోరాటంలో మరణించారు. మరణం తప్పదు ఏదో ఒకనాడు. దేశంకోసం ప్రాణాలర్పించినవాళ్లే మహావీరులు. అటువంటప్పుడు ఆనంద్‌కోసం శోకించడం దేనికి?

వీరాస్వామి మామూలు మనిషవడానికి మరో రెండువారాలు పట్టాయి. నగరంలోకి తిరిగి రావడం, ఆటలాడడం వీటిలో పడి అతని దృష్టి మరలింది. ఒకరోజు జీతం తీసుకుని, తన రెజిమెంట్ మేజర్‌ను కలిసి, ఆనంద్ సూట్‌కేసు, ట్రావెల్ బాగ్ తన గదిలో ఉన్నాయని, వాటిని అతని తల్లిదండ్రులకు చేరవేస్తే బాగుంటుందని అన్నాడు. మేజరు ఎవరిని పంపాలని ఆలోచిస్తూ ఉంటే, వీరాస్వామి ఆ భారం తనమీద వేసుకున్నాడు.

ఆ మరునాడు వీరాస్వామి ఆనంద్ గ్రామానికి బయలుదేరాడు. అతని సూచనలు పాటించాడు.

ఆనంద్ గురించి చేసిన ఆలోచనలు వీరాస్వామిని గాలిలో తేల్చి గ్రామానికి తెచ్చాయి. గ్రామంలోకి ప్రవేశించగానే కిరాణా దుకాణం కనిపించింది. అప్పటికి రాత్రి తొమ్మిదయింది. దాని యజమాని దుకాణం మూయడానికి సర్దుతున్నాడు. వీరాస్వామి కుందన్‌లాల్ ఇంటి గురించి అడిగితే, ఆ దుకాణదారు అన్నాడు.

"కార్గిల్ హీరో ఇల్లా? దగ్గరలోనే ఉంది. మూడిళ్లు దాటితే నాలుగో ఇల్లే అది. మధ్యాహ్నం కలెక్టరుగారు కబురు పంపితే, కుటుంబమంతా పట్నం పోయి ఒక్క అరగంట కిందటే తిరిగి వచ్చింది. ఇప్పుడు మీరు వెళ్లి కలియవచ్చు. వాళ్లీసరికి స్థిమితపడి ఉంటారు."

వీరాస్వామి నెమ్మదిగా ఇంటిని సమీపించాడు. ఎత్తరుగుల ఇల్లది. నాలుగు మెట్లెక్కితే ద్వారం. అరుగువైపు కిటికీ ఒకటుంది. లోపల గదిలో వెలుతురు దానిగుండా కనిపిస్తున్నది వీధి తలుపు మూసి ఉంది.

వీరాస్వామి రెండు మెట్లెక్కేసరికి లోపలనుండి శబ్దాలు వినిపించాయి. ఎవరో హుక్కా పీలుస్తున్నారు. గుడగుడ శబ్దం తరువాత మాటలు వినవచ్చాయి.

"నాలుగేళ్లబట్టి నేను నా వృద్ధాప్యపు పింఛను గురించి అర్జీలు పెడుతూనే ఉన్నాను. బంట్రోతు నుండి బడా బాబు వరకు అందరినీ కలిసి సలాములు పెట్టాను. ఎవరైనా నా మాట వింటే కదా! ఇవాళ కలెక్టరు దొరగారు నా ఆరోగ్యం గురించి అడిగినప్పుడు,

వారికి నా పించను గురించి చెప్పాను. ఆయన వెంటనే కేసు తెప్పించి నా పింఛను మంజూరు చేశారు. బకాయలు కూడా ముడతాయని ఆయన అన్నారు!"

వీరాస్వామి సులువుగా ఆ గొంతుని గుర్తించాడు. అది తప్పకుండా ఆనంద్ తండ్రి, కుందన్‌లాల్ గొంతే.

వీరాస్వామి అలా రెండో మెట్టుమీదే నిలబడ్డాడు.

"ఇంటిల్లిపాదీ, నేను పై చదువులు చదువుకుంటానంటే పెదవి విరిచారు. కలెక్టరుగారు నా చదువు గురించి అడిగారు. నేను స్కూలులో మొదటిదాననే కాకుండా జిల్లా అంతటిలో కూడా మొదటిదానిగా వస్తున్నానని చెప్పాను. నాకు చదువుకోవాలని ఉంది, కాలేజీ, విశ్వ విద్యాలయం ఆ పైని విదేశాలలో పెద్ద పెద్ద చదువులు చదవాలని ఉందని చెప్పాను. ఆయన నా వెన్ను తట్టి అభయమిచ్చారు.. నేను ఎంతవరకు చదవగలనో అంతవరకు చదవవచ్చునని, బసకు, భోజనానికి, పుస్తకాలకు, పరీక్షలకు అయ్యే ఖర్చుంతా ప్రభుత్వమే భరిస్తుందని ఆయన అభయమిచ్చారు. తెలివితేటలున్నవారికి ఆకాశమే హద్దన్నారు!"

ఆమె తప్పకుండా ఆనంద్ చెల్లెలు సరిత అయి ఉంటుంది. ఆమె వివాహం గురించి ఆనంద్ చాలా ఆందోళన పడ్డాడు. ఇప్పుడు పరిస్థితులు మరొకదారి పట్టాయి.

"కలెక్టరుగారు నన్ను దగ్గరగా పిలిచి, కాలువ పక్కనే, రెండు బిగాలు పల్లపు భూమి నాకు ఇస్తానన్నారు. నావంటి బీదరైతు ఇంతకన్నా ఏం కోరుతాడు?"

కుందన్‌లాల్ గొంతు అతను పీలుస్తున్న హుక్కా శబ్దం వలె వినవచ్చింది.

"నేను బియ్యే పాసైన దగ్గరనుంచీ ఉద్యోగాలకోసం అప్లికేషన్లు పెడుతూనే ఉన్నాను. దేనికైనా జవాబు వచ్చి ఏడిసిందా? ఒకటో రెండో అప్లికేషన్లకు జవాబులు వచ్చాయి. ఏం ప్రయోజనం ఖాళీలు లేవని రాశారు. కలెక్టరు గారికి నా అవస్థ గురించి చెప్పాను. ఆయన నా అప్లికేషన్ తీసుకున్నారు. నాకొక గుమాస్తా ఉద్యోగమిస్తానన్నారు. తమ ఆఫీసులో ఖాళీలు ఉన్నాయన్నారు. ఒక వారం రోజులలో పర్మెనెంట్ ఉద్యోగం దొరుకుతుందని హామీ ఇచ్చారు!"

ఇది ఆనంద్ తమ్ముడు కిరణ్ గొంతు.

మళ్ళీ హుక్కా చప్పుడు వినిపించింది.

"ఇవాళ నాకు కలెక్టరుగారు నాలుగు లక్షల రూపాయలకు చెక్కు ఇచ్చారు. కిరణ్‌కు కలెక్టరు ఆఫీసులో ఉద్యోగం దొరుకుతుంది. సరిత సెలవుల తరువాత కాలేజీలో చేరుతుంది. ప్రతిరోజూ మన గ్రామం నుండి వెళ్లి రావడం కష్టమవుతుంది. తిరిగి వస్తూంటే పోస్టాఫీసు దగ్గర నా స్నేహితుడు కలిశాడు. వాడు, రెండు లక్షల రూపాయలకు అన్ని సదుపాయాలతో, అప్పటికీ దగ్గరగా మంచి ఇల్లు అమ్మకానికుందన్నాడు. వచ్చే బుధవారం రిజిస్ట్రేషను చేయించి,

పట్టణం ఇంటికి మారిపోదాం!" అన్నాడు పెద్దాయన.

వీరాస్వామి వాళ్ల అందరి మాటలు విన్నాడు. ఒక్క గాయత్రీదేవి మాటలు తప్ప ఆవిడ ఏం చేస్తుంటుంది? ఆదర్శ గృహిణికి వంటిల్లే గతి. అందరికోసం భోజనం ఏర్పాటులు చేస్తూ ఉంటుంది. గదిలో కూర్చున్న వాళ్ల మాటలు వింటూ, ఏవో జ్ఞాపకాలు తరుముతుంటే, ధారలుగా కారుతున్న కన్నీళ్లనే చీరచెంగుతో ఒత్తుకుంటూ ఉంటుంది.

చలనం లేకుండా, వీరాస్వామి రెండో మెట్టుమీద అలానే ఉండిపోయాడు. ఆ ఇంటి వాళ్లతో దు:ఖం పంచుకోవాలని, ఆనంద్ తనతో చెప్పిన మాటలు వాళ్లకు వినిపించాలని, ఆ తల్లిని ఊరడించాలని వచ్చాడు.

ఆ ఇంట్లోవాళ్లు ఉల్లాసంగా ఉన్నారు. ఉజ్వల భవిష్యత్తు గురించి కలలు గంటున్నారు. తనకీ ఇంట్లోకి ప్రవేశం నిషిద్ధం!

వీరాస్వామి తనతో తెచ్చిన సూట్‌కేసు, ట్రావెల్ బాగ్ ద్వారం దగ్గర ఉంచి, వచ్చిన దారినే చీకట్లోకి మాయమయ్యాడు.